# దయ్యాల ప్రియులు

దయ్యాలున్నాయనే మీరు నమ్ముతారా? అయితే మీలాంటివారు జర్మనీలో చాలామంది వున్నారు. ఈమధ్య జరిగిన ఓ సర్వేలో జర్మనీలో దయ్యాలు ఉన్నాయని నమ్మేవారి సంఖ్య 10లక్షలకి చేరుకుంది. జర్మనీ జనాభా లెక్కల విభాగం వారు ఈ సంగతి వెల్లడించారు. తాము ఇల్లు మారినప్పుడల్లా కొత్త ఇంట్లో దయ్యాలున్నాయని ఎవరైనా చెబితే జనం నమ్మేస్తున్నారు. 82.2 మిలియన్ల మంది వున్న జర్మనీలో ఇలా దయ్యాల మీద నమ్మకం ఉన్నవారి సంఖ్య ఏ ఏటికాయేడు బాగా పెరిగిపోతోంది. అయితే తమకున్న ఈ నమ్మకం గురించి ఎవరూ ఇతరులకు చెప్పక పోవడం గమనార్హం. తమకు ఎంత భయం ఉన్నా ఇతరుల ముందు చెప్పి తమ బలహీనతని బహిర్గత పరచడం ఎవ్వరికీ ఇష్టం లేదట. సర్వేలో పాల్గొనేటప్పుడే వారంతా ఈ షరతు విధించారు. తమకు దయ్యాలంటే భయం అని చెబితే తమను బ్లాక్‌మెయిల్ చేస్తారని వారు నమ్ముతున్నారు. మొత్తానికి టెక్నాలజీ కొత్త పుంతలు ఈ యుగంలో కూడా ఇలా దెయ్యాలున్నాయని నమ్మేవారు పెరిగిపోవడం వింతగా లేదూ!

# సంపాదనలో మేటి విల్ స్మిత్

ఒకసారి పేరంటూ వస్తే సంపాదన మనల్ని వెదుక్కుంటూ వస్తుందంటారు. ఈ మాట హాలీవుడ్ నటుడు విల్ స్మిత్ విషయంలో నిజమేనేమో అన్పిస్తుంది. 39 ఏళ్ళ విల్‌స్మిత్ హాలీవుడ్‌లో అత్యధికంగా సంపాదించే నటుడుగా పేరు తెచ్చుకున్నాడు. అతని వార్షికాదాయం 80



మిలియన్ డాలర్లు. అతని తర్వాత స్థానం జాన్ డీప్‌కి దక్కింది. ఆయన ఏటా 72మిలియన్ డాలర్లు ఆర్జిస్తున్నాడు. హాలీవుడ్ చిత్రాల్లో అసాధారణ నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటున్నాడు విల్ స్మిత్. అతను నటించిన ఎనిమిది చిత్రాలు వరుస విజయాలు సాధించడంతో బాక్సాఫీస్ పరంగా కూడా అతని చిత్రాలు మిగతా తారల సినిమాల కంటే ముందంజలో వున్నాయి. అతను నటించిన చిత్రాలు గత ఏడాది 100 మిలియన్ డాలర్లు వసూలు చేసి చరిత్ర సృష్టించాయి. ఇలా ఒకే తార నటించిన చిత్రాలు విజయం సాధించడం గొప్ప విషయంగా చెప్పుకుంటున్నారు. వరుస చిత్రాల జైత్ర యాత్రతో విల్‌స్మిత్ సంపాదనలో మేటిగా మారిపోయాడు.

## 'సరసి'కత

# ఎంత 'లేటు' ప్రేమయో!

వైశంపాయనుడి మేనత్త కొడుకు డాక్టర్ కుంచితపాదం సిటీలో క్లినిక్కు పెట్టి బాగా గడించేడు.

ఓసారి వైశంపాయనుడు వాళ్లింటికి వెళ్లినపుడు మూల ఒక గదిలో విసనకర్రతో వొంటరిగా కూర్చున్న అతడి తల్లిని చూశాడు. ఆమె అవస్థకి జాలి కలిగింది వైశంపాయనుడికి.

''మీ అమ్మ గదిలో గాలాడక అపసోపాలు పడుతోంది. ఆ గది క్కూడా ఏసీ పెట్టించకూడదా బావా?'' అన్నాడు వైశంపాయనుడు కుంచితపాదంతో. ''పెట్టిద్దాం పెట్టిద్దాం'' అన్నాడతడు.

ఇది జరిగిన కొద్ది రోజులకి కుంచితపాదం తన తల్లిని వృద్ధాశ్రమానికి




పంపించేసినట్టు తెలిసింది వైశంపాయనుడికి.

తర్వాత అతగాడు ఏదో ఫంక్షనులో కలిసినపుడు ''చివరి రోజుల్లో కొడుకు దగ్గరుండాలనుకుంటుంది ప్రతి తల్లి. నా మాట విని అత్తయ్యని వృద్ధాశ్రమం నుంచి ఇంటికి తెచ్చేసుకో బావా'' అన్నాడు వైశంపాయనుడు స్వతంత్రించి. ''తెద్దాం, తెద్దాం'' అన్నాడు డాక్టరు గారు.

కొద్ది రోజులకి, ఆమె పోయిందని ఫోనొస్తే వైశంపాయనుడు, సుబ్బాయమ్మ గారు వెంటనే బయల్దేరి వెళ్లారు. హఠాత్తుగా కన్నుమూసిందని వృద్ధాశ్రయం నుంచి ఫోనొస్తే కుంచితపాదం వెళ్లి తల్లి శవాన్ని ఇంటికి తీసుకొచ్చాడట. కొందరు బంధువులు పొరుగూళ్లనించి రావలసి ఉన్నందున అంత వరకూ పాడైపోకుండా ఉండటానికి ఏ.సి. బాక్సులో పెట్టించాడు డెడ్ బాడీని.

''మీరు చెప్పినవి రెండూ చేశాడు మీ బావ. ఎటొచ్చీ లేటయిందంతే!'' అంది సుబ్బాయమ్మగారు భర్తతో.

*